పెండింగ్‌ వేతనాలు వెంటనే చెల్లించాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు నాగేశ్వరరావు

పటాన్‌చెరు టౌన్‌: ఈఎస్‌ఐ రామచంద్రాపురం ఆసుపత్రిలో పనిచేస్తున్న, ఔట్‌ సోర్సింగ్‌, కాంట్రాక్టు కార్మికులకు గత ఆరు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నాగేశ్వరరావు డిమాండ్‌ చేశారు. గురువారం పటాన్‌చెరు పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ..ఈఎస్‌ఐలో ఔట్‌ సోర్సింగ్‌లో 125 మంది, కాంట్రాక్టు వర్కర్లుగా 56 మంది పనిచేస్తున్నారని 15 సంవత్సరాలుగా పనిచేస్తున్నా, పది వేల రూపాయల వేతనాలు మాత్రమే వస్తున్నాయని చెప్పారు. గత ఆరు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో అప్పులు చేస్తూ ఇబ్బందిపడుతున్నారని చెప్పారు. గత రెండు మూడు సంవత్సరాలుగా జీతాల సమస్య వస్తోందని ఆరోపించారు. కనీస వేతనం రూ. 26 వేల పెంచాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నిరుపేదలకు కార్పొరేట్‌ వైద్యం


ఎల్‌ఓసీని అందజేస్తున్న మహిపాల్‌ రెడ్డి

పటాన్‌చెరు: నిరుపేదలకు కార్పొరేట్‌ వైద్యం అందించడంలో సీఎం సహాయనిధి వరప్రదాయనిగా నిలుస్తోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపల్‌ పరిధిలోని పురానాబస్తీ కాలనీకి చెందిన అహ్మది కథాన్‌ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. వైద్య చికిత్స కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన రూ. రెండు లక్షల 50 వేలు ఎల్‌ఓసీని గురువారం అతని కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

వన్యప్రాణి సంరక్షణ అందరి బాధ్యత

శంషాబాద్‌: వన్యప్రాణులను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ హిమబిందు పేర్కొన్నారు. జాతీయ వన్యప్రాణి దినోత్సవంలో భాగంగా కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... జీవవైవిధ్యంతోనే ప్రకృతి సమతుల్యంగా ఉంటుందన్నారు. వన్యప్రాణులను హరించివేస్తే ప్రకృతి అనర్థాలు కూడా ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వైస్‌ ప్రిన్సిపాల్‌ భాను ప్రకాష్‌, అధ్యాపకులు దుర్గాభవాని, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

హైటెక్‌.. అప్‌గ్రేడ్‌కు నోచుకోని ప్రాథమిక పాఠశాలలెన్నో..

ఇదీ గచ్చిబౌలి డివిజన్‌ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల దుస్థితి

రాయదుర్గం: దశాబ్దాలు గడుస్తున్నా ప్రభుత్వ పాఠశాలలను అప్‌గ్రేడ్‌ చేయకపోవడంతో పై తరగతులు చదవాలంటే ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటోంది. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఇబ్బందులు పడుతున్నారు. హైటెక్‌ ప్రాంతంగా పేరొందిన గచ్చిబౌలి డివిజన్‌లోని పాఠశాలల్లో పేద, మధ్య తరగతి ప్రజలు, వలస వచ్చిన కార్మికులు తమ పిల్లలను చదివిస్తున్నారు. ఐటీ కారిడార్‌, ఫైనాన్షియల్‌ డిస్ట్రిక్ట్‌ ప్రాంతాలకు చేరువలోనే ఉండే బస్తీలు, కాలనీలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఐటీ, ఆర్థిక, ఇతర సంస్థలు ఏర్పాటు చేశారు. కానీ ఇక్కడి పాఠశాలలను అప్‌గ్రేడ్‌ చేయకపోవడం ఆశ్చర్యకరం.


మధురానగర్‌ ప్రభుత్వ పాఠశాల

మధురానగర్‌లో..

మధురానగర్‌లో పేద, మధ్య తరగతి వర్గాల పిల్లలు ఎక్కువగా చదువుకుంటున్నారు.ఇక్కడ నాలుగు దశాబ్దాలుగా 5వ తరగతి వరకే ఉంది. 5వ తరగతి పూర్తి చేసిన వారు కొందరు ఖాజాగూడ, మరికొందరు రాయదుర్గంలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలకు వెళుతున్నారు. మధురానగర్‌లో ప్రాథమిక పాఠశాల చెంతనే ప్రభుత్వ జూనియర్‌ కళాశాల ఉండడంతో ఈ పాఠశాలను అప్‌గ్రేడ్‌ చేయడానికి చొరవ తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


నానక్‌రాంగూడ ప్రభుత్వ పాఠశాల

నానక్‌రాంగూడలో..

నానక్‌రాంగూడలో ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల ఉంది. కానీ స్థానికులు తమ పిల్లలను రాయదుర్గం, ఇతర ప్రాంతాలలోని ప్రైవేట్‌ పాఠశాలల్లో చదివిస్తున్నారు. కొంతమంది, వలస కార్మికుల పిల్లలు అంతా ఇక్కడే చదువుకుంటున్నారు. ఇక్కడ తరగతులను అప్‌ గ్రేడ్‌ చేయకుండా అవే తరగతులతో కొనసాగిస్తున్నారు. దీంతో నానక్‌రాంగూడలో చదువు అయిపోగానే ఖాజాగూడ వెళ్లి అక్కడి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో చదువుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.ఈ పాఠశాలను జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్‌ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గౌలిదొడ్డిలో ..

గౌలిదొడ్డిలో ప్రాథమికోన్నత పాఠశాల కొనసాగుతోంది. ఈ పాఠశాల ప్రాంగణం విశాలంగా ఉంది. ఇక్కడ జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాల ఏర్పాటునకు స్థలం కొరత ఉండదు. అలాగే చేరువలో ఉండే గౌలిదొడ్డివాసులకే కాకుండా కేశవనగర్‌, గోపన్‌పల్లితండా, గోపన్‌పల్లి, ఎన్టీఆర్‌నగర్‌, తాజ్‌నగర్‌, సోఫా కాలనీ వంటి ప్రాంతాల విద్యార్థులకు మేలు చేకూరే అవకాశం ఉంది. ఈ ప్రాంతాలలో అంతా పేద, కార్మిక వర్గాలవారే ఉండడంతో చెంతనే ఉన్నత పాఠశాల ఆవశ్యకత ఉంది. దశాబ్దాలుగా ప్రాథమికోన్నత పాఠశాలగా కొనసాగించడంతో స్థానిక విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. ఆయా పాఠశాలల స్థాయి పెంపుపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టి సారించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.



గౌలిదొడ్డి ప్రభుత్వ పాఠశాల

‘ఐఎస్‌బీ’లో మోతీలాల్‌ ఓస్వాల్‌ ఎగ్జిక్యూటివ్‌ సెంటర్‌

నేడు ప్రారంభించనున్న డిప్యూటీ సీఎం భట్టి

రాయదుర్గం: మోతీలాల్‌ ఓస్వాల్‌ ఎగ్జిక్యూటివ్‌ సెంటర్‌ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఇండియన్‌ స్కూల్‌ ఆఫ్‌ బిజినెస్‌ (ఐఎస్‌బీ) హైదరాబాద్‌ క్యాంపస్‌లో ఒక కొత్త ఆధునిక సౌకర్యం. ఈ కేంద్రం ఏర్పాటుకు మోతీలాల్‌ ఓస్వాల్‌ ఫౌండేషన్‌ నుంచి రూ.100 కోట్లు కేటాయించారు. ఈ కేంద్రాన్ని 1,91,532 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేయగా ఈ సెంటర్‌ను శుక్రవారం ఉదయం 11 గంటలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు, మోతిలాల్‌ ఓస్వాల్‌ ఫైనాన్షియల్‌ సర్వీసెస్‌ లిమిటెడ్‌ సీఈఓ ,మేనేజింగ్‌ డైరెక్టర్‌ మోతిలాల్‌ ఓస్వాల్‌ కలిసి ప్రారంభిస్తారు. ఈ కేంద్రం పెద్ద, ఆధునాతన సముదాయం. ఇది ఎగ్జిక్యూటివ్‌ విద్య, భవిష్యత్‌ వ్యాపార నాయకుల అభివృద్ధిపై ఐఎస్‌బీ దృష్టిని మరింత పెంచడానికి రూపొందించారు. ఇందులో లెక్చర్‌ థియేటర్లు, సమావేశ గదులు, అధ్యాపకులు, సిబ్బందికి కార్యాలయాలు, సహకారం, అభ్యాసాన్ని పెంపొందించడానికి అంకితమైన ఫ్యాకల్టీ లాంజ్‌ ఉన్నాయి.


ఇటీవల ఒప్పందం చేసుకున్న ప్రతినిధులు

ఉన్నత ప్రమాణాల విద్యను ప్రోత్సహించడమే లక్ష్యం : మోతీలాల్‌ ఓస్వాల్‌

భారతదేశంలోని విద్యారంగంలో ఉన్నత ప్రమాణాలతో విద్యను ప్రోత్సహించడమే మోతీలాల్‌ ఓస్వాల్‌ ఫౌండేషన్‌ లక్ష్యంగా పనిచేస్తుందని ఆ ఫౌండేషన్‌ చైర్మన్‌ మోతీలాల్‌ ఓస్వాల్‌ స్పష్టం చేశారు.ప్రతిభ అవకాశాలు, వనరులు, మార్గదర్శకత్వం, అనుకూలమైన వాతావరణంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని చెప్పారు.

వ్యాపారవిద్యలో ఐఎస్‌బీ ఒక అత్యుత్తమ కేంద్రం : హరీష్‌మన్వాని

భారతదేశంలో వ్యాపార విద్యలో ఐఎస్‌బీ ఒక అత్యుత్తమ కేంద్రంగా మారిందని ఐఎస్‌బీ ఎగ్జిక్యూటివ్‌ బోర్డు చైర్మన్‌ హరీష్‌ మన్వాని స్పష్టం చేశారు. వేగంగా మారుతున్న వ్యాపార వాతావరణంలో తమ సామర్థ్యాలను పెంపొందించుకోవడానికి భారతదేశంలోని కార్పొరేట్‌ ఎగ్జిక్యూటివ్‌లకు ప్రపంచస్థాయి ఎగ్జిక్యూటివ్‌ విద్య అవసరం ఉందన్నారు.

నైపుణ్యం, విలువలను మిళితం చేయాలి

ఇఫ్లూ వీసీ నాగరాజు

రాయదుర్గం: భవిష్యత్‌కు నైపుణ్యాలు, విలువలను మిళితం చేయాలని ఇఫ్లూ వీసీ ప్రొఫెసర్‌ ఎన్‌ నాగరాజు అన్నారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ‘కొత్త సామాజిక ఒప్పందం కోసం ఉపాధ్యాయులు’ అనే అంశంపై గురువారం సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ సమ్మిళిత బోధనలను ప్రోత్సహించాలని, విద్య హక్కును ప్రజా ప్రయోజనంగా విస్తృతం చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ జీవితాంతం నేర్చుకోవడానికి కృషి చేయాలన్నారు. ‘మనూ’ వీసీ ఐనుల్‌ హసన్‌ మాట్లాడుతూ ఉపాధ్యాయ మార్గం సంక్లిష్టమైనది, సున్నితమైనది, సవాళ్లతో కూడి ఉంటుందన్నారు. పరిస్థితులను అర్థం చేసుకోవడం, లోపాలను గుర్తించడం, సామర్థ్యాలను అభివృద్ధి చేయడం , నాణ్యతను గుర్తించడం వంటి వాటిపై దృష్టి పెట్టిన వారే రాణిస్తారన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్‌ ప్రొ.ఇష్తియాక్‌ అహ్మద్‌, ఎస్‌ఈటీ డీన్‌ ప్రొ.వనజ, ప్రొఫెసర్‌ షహీన్‌ ఏ షేక్‌, డా. అథర్‌ హుస్సేన్‌, ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.

‘స్వయంపాలన’



రాయదుర్గం: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం కొండాపూర్‌లోని సంస్కృతి హైస్కూల్‌లో స్వయంపాలనలో భాగంగా విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. భవిష్యత్తులో చక్కగా పాఠాలు వింటూ, మా తోటివారు కూడా వినేలా చూస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

పరిశ్రమ- విద్యారంగం కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు

ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్‌ ఈడీ డా.తేజ్‌లోహిత్‌రెడ్డి

రాయదుర్గం: పరిశ్రమ–విద్యారంగం రెండూ కలిసి పనిచేస్తే మంచి ఫలితాలు వస్తాయని ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఎస్‌ తేజ్‌లోహిత్‌రెడ్డి అన్నారు. రాయదుర్గంలోని ఎఫ్‌డీడీఐ-హైదరాబాద్‌ క్యాంపస్‌లో గురువారం పరిశ్రమ–విద్యారంగంలో పురోగతి సాధించడానికి అవసరమైన చర్యలు అనే అంశంపై జాతీయ పరిశోధనా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సును ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో ఎన్నో మార్పులు చోటు చేసుకుంటున్నాయని ,విద్యార్థులు చదువుతోపాటు వినూత్న ఆలోచనలు, నూతన ఆవిష్కరణలతో భవిష్యత్తు అవసరాలను తీర్చేలా తీర్చిదిద్దాలన్నారు. పరిశ్రమలకు అవసరమైన మేరకు ఉద్యోగులను అందించేలా విద్యారంగంలో విద్యార్థులకు బోధన, సిలబస్‌ ఉండేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. చదువు పూర్తి కాగానే క్యాంపస్‌ సెలక్షన్‌లో ఉద్యోగం సాధించాలనే తపన ప్రతి విద్యార్థిలో ఉంటుందని, అందు కోసం పరిశ్రమలు కూడా ఉన్నత విద్యాసంస్థలతో కలిసి పనిచేస్తే ఎంతో మేలు చేకూరడం ఖాయమన్నారు. పరిశోధనా రంగంలో ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి ముందుండాలన్నారు. అనంతరం ఐఐటీ హైదరాబాద్‌ ప్రొఫెసర్‌ సుహాష్‌ రంజన్‌డే, ఇండియన్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ పెట్రోలియం నటరాజ్‌ నందమూరు, ఆంధ్రప్రదేశ్‌ నేషనల్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ డిజైన్‌ ప్రొఫెసర్‌ శ్రీరామ్‌ మట్టేగుంట మాట్లాడుతూ విద్యారంగం అనుబంధ పరిశ్రమల భవిష్యత్తును రూపొందించడంలో తమవంతు సహకారం అందించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాసంస్థలు, పరిశ్రమల మధ్య దీర్ఘకాలిక భాగస్వామ్యాలు అవసరమని వారు అభిప్రాయపడ్డారు. అనంతరం 14 మంది అధ్యాపకులు వివిధ ప్రత్యేక డొమైన్లలో ఇంటర్‌ డిసిప్లినరీ పరిశోధనలను ప్రదర్శించారు. 15 మంది విద్యార్థులు మార్గదర్శక ప్రాజెక్టులు, పరిశోధనా భావనలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీడీఐ సీఓఈ జాయింట్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ అభిరూమ్‌ చటర్జీ, కె అబ్దుల్‌ రహమాన్‌, ఇతర ఫ్యాకల్టీ ప్రతినిధులు, విద్యార్థులు పాల్గొన్నారు.


జాతీయ సదస్సును ప్రారంభిస్తున్న డాక్టర్‌ ఎస్‌ తేజ్‌లోహిత్‌రెడ్డి

భవిష్యత్‌ సమాజ నిర్దేశకులు అధ్యాపకులే

హెచ్‌సీయూ రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ మీనా హరిహరన్‌


హెచ్‌సీయూ రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ మీనా హరిహరన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి: భవిష్యత్‌ సమాజ నిర్దేశకులు అధ్యాపకులేనని హైదరాబాద్‌ సెంట్రల్‌ యూనివర్సిటీ రిటైర్డ్‌ ప్రొఫెసర్‌ మీనా హరిహరన్‌ తెలిపారు. ఫ్రెండ్స్‌ అసోసియేషన్‌, బిల్డర్‌, సామాజిక సేవా కార్యకర్త టి.రాఘవేంద్రరావు సంయుక్త ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి జిల్లా పరిషత్‌ స్కూల్‌లో టీచర్స్‌ డేను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డిగ్రీ, జూనియర్‌ కళాశాలల, స్కూల్‌ టీచర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మీనా హరిహరన్‌ మాట్లాడుతూ విశ్వంలో అత్యంత గౌరవప్రదమైన వృత్తి అధ్యాపకులదే అన్నారు. ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కన్వీనర్‌ తాడిబోయిన రామస్వామి అధ్యక్షతన జరిగి ఈ కార్యక్రమంలో ఎంఈఓ వెంకటయ్య, హెచ్‌ఎం సుభాశ్‌చంద్రారెడ్డి, రాములు, బసవలింగం, తాజ్‌బాబు, వసుంధర, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

‘వాటర్‌ హెడ్‌ ఆఫ్‌ ఇండియా’ సేవలు అభినందనీయం


వాటర్‌ ట్యాంకును ప్రారంభించిన ఎమ్మెల్యే గాంధీ

మియాపూర్‌: వాటర్‌ హెడ్‌ ఆఫ్‌ ఇండియా సంస్థ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. మియాపూర్‌ డివిజన్‌ పరిధిలోని సుభాష్‌ చంద్రబోస్‌నగర్‌ కాలనీలో సంస్థ సౌజన్యంతో రూ.2లక్షల 15వేలతో నూతనంగా నిర్మించిన వాటర్‌ ట్యాంక్‌ను కార్పొరేటర్‌ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సామాజిక సేవ గొప్పదని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.


వర సిద్ధి వినాయక..


ఖాజాగూడలో అన్నసమారాధన

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో గణనాథుల పూజలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. శనివారం నిమజ్జన కార్యక్రమాలు ఉండడంతో భక్తులు స్వామివారిని దర్శించుకుంటున్నారు. పలుచోట్ల లడ్డూ వేలం పాటలు పోటాపోటీగా సాగాయి. గంగమ్మ తల్లి యూత్‌ అసోసియేసన్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ లడ్డూ వేలం పాటలో మిరియాల ప్రీతం తన కుమార్తె మిరియాల నిహీరా పేరుతో రూ.1.90 లక్షలకు సొంతం చేసుకున్నారు.


ఆలయ ఆవరణలో హోమం చేస్తున్న అర్చకులు


గోకుల్‌ ప్లాట్స్‌లో వినాయక మండపంలో ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ


గణేష్‌గడ్డలో లక్ష్మీ గణపతిగా..



చందానగర్‌ రాజీవ్‌నగర్‌లోరూ.1.90 లక్షలకు లడ్డూను సొంతం చేసుకున్న ప్రీతం

లక్ష్మీ గణపతిగా..

భక్తులతో కిటకిటలాడిన గణేష్‌గడ్డ దేవస్థానం

పటాన్‌చెరు టౌన్‌: నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండల పరిధిలోని రుద్రారం గ్రామ సమీపంలో కొలువైన గణేష్‌ గడ్డ దేవస్థానం గురువారం భక్తులతో కిటకిటలాడింది.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మాట్లాడుతూ... ఉదయం స్వామివారికి అభిషేకం, హోమంతో పాటు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించమన్నారు.స్వామివారిని దర్శించుకోవడానికి పలు ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉత్సవాలలో భాగంగా స్వామివారిని నాణేలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవాలకు తరలి వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని, ఆలయంలో నిత్యాన్నదాన కార్యక్రమం సాగుతుందని ఆలయ ఈఓ లావణ్య,జూనియర్‌ అసిస్టెంట్‌ ఈశ్వర్‌లు తెలిపారు.


ఖాజాగూడలో..


కొండాపూర్‌ డివిజన్‌లో..


గచ్చిబౌలి డివిజన్‌లో..


మైహోమ్‌ భుజాలో.. కేతనరెడ్డి కూచిపూడి నృత్య ప్రదర్శన


కొత్తగూడలో.. బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్‌


బాపూనగర్‌లో.. కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌యాదవ్‌, నిర్వాహకులు